
# కన్నీటి పాట

## ముళ్ళపూడి వెంకటరమణ



పన్నీటి జల్లులా పడింది వాన.

ఆవురావురు మంటున్న వేసంకాలం గుండె జివ్వుమంది. బాధ లోంచి హాయి ఎగజిమ్మింది. హాయిగా సన్నటి ఆవిర్లు నిట్టూర్చింది. అవి వట్టివేరు వాసనకి రేఖా చిత్రాల్లా వున్నాయి.

పల్లెటూరి పెరట్లో మల్లె పందిరి పక్కన వేశారు తొలి రాత్రి పక్క ...

"అనాఘ్రాతం పుష్పం" అని గొణుక్కున్నాడు బుజం వాసన చూస్తూ...

సుబ్బులు కంగారు పడింది. పక్కకి జరిగింది.

"ఇంకా నిద్దే పోలేదు. కలవరిస్తున్నారు" అంది దీనంగా చూస్తూ—

తను బుజాన్ని విడిచి పెట్టలేదు. తిరిగి గాఢంగా వాసన పీల్చాడు.

"కలవరింత కాదు. కవిత్వం. కాళిదాసవీ ఓ పెద్ద



6-7-90

కని చెప్పాడు. ఎవరూ ముట్టుకోని పువ్వుని తొలి సారిగా వాసన చూసినవాడి గురించి... అదృష్టం అంటే వాడిదే... ఆ తరవాత ఇగో నీడిదే... హా... వట్టివేరు వాసనకన్నా బాగుంది నీ బుజం."

సుబ్బులు సకాలున నవ్వి పక్కకి జరిగింది. అటు తిరిగింది.

"చాల్లాలు. వట్టివేరూ లేదు — గట్టి వేరూ లేదు — గట్టిగా పీలిస్తే చెమట వాసనేస్తుంది."

వెంటనే రెండో బుజం ఆఘ్రాణించాడు.

"వట్టివేరు కాదు. పారిజాతం. బొగడ పువ్వు. సరిగ్గా చెప్పాలంటే సేసంకాలం పొలం మీద తొలకరి పడ్డపుడు వచ్చే సువాసన లేదూ? అది. ఇవాళ ఇది నన తొలకరి. అదే నింగి నేలా కలయిక... తొలి ముద్దు... హు ...హూ... తెలుగులో అచ్చులు 16, హల్లులు 36. ఉభయాక్షరాలు మూడు సున్నా, అరసున్న విసర్గ. కాని ఈనాడు ఇవి వాడకంలో లేవు...ట! ఎవ్రడా చెప్పాడు? చెప్పిన చెనలా ఘెవ్రడా?... మైధునాంతాన హో హూ ల పక్కన అరసున్న లేకపోతే భాషేమిటి? అది భావాన్ని పలక గలదా? సుఖాన్ని తెల్గించ గలదా? ఆ?... వాడకంలో లేవుట... హాk ... హుౕc ...

ఆకాశంలో ఊగిపోతున్నాడు ఆనందరావు.

గుభేల్న గుద్దుపడింది వీపు మీద.

*   *   *

"ఆ? ఎవరది?" అన్నాడు ఆనందరావు.

"ఇంకెవరు? నేనే - నీ నేస్తం."

"ఓ నువ్వా ఆకలినా?... సోదరా! యాభై ఏళ్ళ నించి ఇల సాటిలేని జంటలా వుంటున్నాం. లోగడ నువ్వు నా నీడని. ఇప్పుడు నేనే నీ నీడలా వెన్నంటి వస్తున్నాను. అలవాటే గదా... ఏదో మట్టివాసనలో వట్టివేరు వాసన లేరుకుని హాయిగా వుంటే ఇపుడిలా వెన్నుపోటు పొడుస్తావా? ఇప్పుడే పగ తీర్చుకోవాలా?"

"సరేగాని — అదేనిటి అప్పుడే ఇంటికేసి నళ్ళావు. అప్పులు దొరకనని తేలడానికి ఇంకా నాలు గైదు వీధులున్నాయి."

"నా వల్ల కాదు. కాళ్ళు గుదిబండల్లా వున్నాయి. అవి నన్ను మొయ్యటం లేదు. నేనే వాటిని లాగు తున్నాను. నా కోపిక లేదు. కొంపచేరి—"

"—చేరి?"

"ఏవుంది. కడుపులో కాళ్ళెట్టుకు పడుకుందా మని."

"కడుపులో కాళ్ళు పెడతావా?... నాకే చోటు చాలక ఉక్కిరి బిక్కిరై చస్తుంటే—"

"నువ్వు చావవు... నా వల్ల నీకా భయం లేదు... మూర్ఛబో... నిదరబో... బాబ్బాబు — పీక్కు తినకు."

"హ హ హ ... తమాషే కన్నావు. ఇంతకీ నేను నీ తాలూకు ఆకల్నిగాను గురూ! అది ఎప్పుడో కోమాలో పడిపోయిందిగా — నువ్వేమేనా పడేసినా దానికి తెలీదు. అనదు."

"మరి?"

"వాల్మీకి ఫామిలీ ఏజంటుని."

"వాళ్ళెవరు?"

"లోగడ వాల్మీకి దారి దోపిడీలు చేసి పెళ్ళాం బిడ్డల్ని పోషించేవాడట. ఇంకోడి పొట్టకొట్టి తెచ్చిన పాపిష్టి కూడులో పాలు పంచుకుంటున్నారు గదా, ఆ పాపంలో కూడా పాలుపంచుకుంటారా అని వారదుల వారడిగించారు. పాలే తప్ప పాపాల సంగతి మా కననసరం నీ సుఖం కోసం ఫామిలీ పెట్టుకున్నావు గాని మా కోసం గాదు. చచ్చినట్టు నువ్మల్ని మేపాలి — చచ్చాక నరకానికి పోవాలి అన్నారట... అలాగ్గా నీ యిల్లాలూ — అదే మెడ మీద వట్టివేరు, బొగడ వగైరా వాసనలు గుప్పించే నీ అర్ధాంగి సుబ్బలక్ష్మి, నువ్వూ, నీ దయవల్ల ఆవిడ వెదజల్లిన అయిదారుగురు పిల్లలూ, వాళ్ళ తాలూకా ఆకలేజంటుని—"

"ఓహో!" అన్నాడు ఆనందరావు.

"ఓహోలో 'హో' పక్కన అరసున్న వుంటుందా?..."

"నీకు ధర్మం కాదు. దుఃఖ చీకటి సముద్రంలో ఏడుస్తూ కూచోకుండా చిన్న దీపం వెలిగించుకుని సంతోషపడుతుంటే — ఇలా గుప్పున ఊదేస్తావా?"

"తప్పదు. కలకీ, ఆకలికీ పడదు. తెలుసుగా. ఆకలి ఐహికం కల ఆముష్మికం."

"బోడి వేదాంతం."

"బోడులకే ఆకలి తప్పలేదు. తలలు బోడులైన తలపులు బోడులా? అయినా నారు బోసినవాడు నీరు పొయ్యాలని దేవుడికే రుద్దారు. నీకు తప్పతుందా? ఇటు...ఇటు... ఇటు తిరిగి గోదావరి ఒడ్డు రోడ్డెక్కు..."

ఆకలెరగని వాళ్ళూ ఆయాసం ఎరగని వాళ్ళూ రోడ్డు మీద పదుగూ పేకల్లా తిరుగుతున్నారు... అప్పల ఆశతో కొందరూ, బాకీల బాధతో కొందరూ... ఆకలి వెయ్యడం కోసం కొందరూ, ఆకలి తీరడం కోసం కొందరూ—

ఆకలీ ఆనందరావూ ఇలా సాటిలేని జంటలా ఒకరి మీద ఒకరు మండిపడిపోతూ చల్లగా తెల్లగా నవ్వుతూ నడుస్తున్నారు.

"ఈ రోడ్డు చాలా కష్టాల రోడ్డు. పురుగూ పుట్రా పురీ గుట్రా వుంటాయి" అన్నాడు ఆనందం.

"సుబ్భరమైన తార్రోడ్డు. పెర్సిలైట్లలాటి దీపాలు, పుచ్చపువ్వులాంటి వెన్నెల — పురుగూ పుట్రా, పురీ గుట్రా ఏన్నేం చేస్తాయి?"

"అదే నీ అజ్ఞానం. నీ కడుపు గోల తప్ప లోకజ్ఞానం లేదు. ఇక్కడ పురుగూ పుట్రా, పురీ గుట్రా అంటే వేరే అర్థం. నాకు అయిదూ, పదీ, పాతికా, పరకా అప్పిచ్చి — ఆ వసూళ్ళ కోసం వేటాడే నరరూప రాక్షసులు అని టీక, తాత్పర్యం. ఈ రోడ్డు మీదకి ఈడ్చుకొచ్చావు... ఎవడైనా ఎదురై కాలరు పట్టుకుని నా బాకీ మాటేనిటయ్యా అంటే—?"

" 'చొక్కా వదులు!' అని గింజుకో — కాలరు దగ్గర చిరుగుతుంది. 'నా చొక్కా చింపేశావు రోయ్' అంటూ సబ్జెట్టు మార్చేసి రట్టు చెయ్యి. హడిలిపోయి రూపాయో, అర్థో అప్పిస్తాడు కుట్టించు కొందికి—"

"ఛీ — నువ్వు వాల్మీకి ఫామిలీ కన్నా కనికష్టం. విశ్వాసం లేదు."

"ఎందుకుండాలి... అయినా వాల్మీకి ఫామిలీవాళ్ళు నిజాయితీపరులు కాబట్టే నిజం చెప్పేశారు. నిజాని కన్ని ఫామిలీలూ అంతే — చాలా

## వేళ్ళతో చిలకపలుకులు!!



మనిషికి మాటలు రాకపోవడం, చూడలేకపోవడం ఒక శాపం లాంటిదే — ఇది ఒకప్పటిది. అయితే ఇపుడు మాత్రం అంధులూ, మూగవారూ మామూలు మనుష్యుల లాగే జీవితం గడుపుతున్నారని చెప్పుకోవచ్చును. ఇందుకు కారణం మానవుడు నిరంతరం జరుపుతున్న సరికొత్త ప్రయోగాలూ, రూపొందిస్తున్న సరికొత్త పరికరాలూ అని చెప్పుకోవలసి వుంటుంది.

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త టాబీ చర్చిల్‌కు మాటలు రావు. మామూలు టైప్ రైటర్ ఇతనికి ఏ మాత్రం ఉపయోగపడలేదు. అందువల్ల ఈయన మరో టైపురైటర్‌ను రూపొందించే పనిలో మునిగిపోయాడు. అలా "లైట్ రైటర్" రూపొందించాడు. ఇందులో "లిక్విడ్ క్రిస్టల్ స్క్రీన్" వుంటుంది. ఇది బోర్డుపైన రాయబడే సందేశాన్ని అందిస్తుంది.

వేళ్ళతో మీటలను నొక్కితే స్క్రీన్ పై కావలసిన వాటిని తెలియజేస్తుంది. ఈ సాధనం అతి తేలికైనది. ఇది 215, 120, 36 మి.మీ. సైజులో వుంటుంది. బరువు అరకిలో వుంటుంది. ఇందులో "టూవే ట్రాఫిక్" విధానం అమర్చబడింది. అలా ఇది అడిగిన దానికి సమాధానం కూడా చెబుతుంది—

ఇది సమాధానం చెప్పే ముందు ఇందులో నుండి ఒక విధమైన సౌండ్ వస్తుంది. దీంతో సమాధానం వస్తుందని గమనించవలసి వుంటుంది. మూగవారికి అన్నివిధాలా ఉపయోగపడే ఈ సాధనాన్ని ఎక్కడికైనా అవలీలగా తీసుకువెళ్ళవచ్చును.

—ఎ. పండరినాథ్

మంది నిజం చెప్పరు కాని అంతే. వాళ్ళకి ఫామిలీ నిజం చెప్పేసింది. నిజమే. వాళ్ళు నిన్నేం అడగలేదుగా ఫామిలీ పెట్టనాయ్ అని — నువ్వే పెళ్ళాడావు — ఫామిలీ పెట్టావు. ఇవాళ నీ సుఖాల ఇంజను పెట్టె లాగుతున్నది దానికి జేరబడి తగులుకున్న కష్టాల గూడ్సు రైలునే. సానికన్న సంసారి హెక — ఛీ అనుకున్నావు. అది స్పాట్ కాష్ వసూలు చేసి చెయి కడుక్కుంటుందనీ, సంసారి బతుకంతా వదలని బంక అని తెలుసుకోలేదు. పెళ్ళాం అయితే రోజుకెన్నిసార్లయినా ఏడాది కెన్ని రోజులయినా దమ్మిడీ ఖర్చు లేదను కున్నావు. అయిదుగురు మొలుచుకొచ్చారు. వాళ్ళ పోషణా —''

''ఛీ దరిద్రుడా! పవిత్రమైన భార్యాబిడ్డల సంబంధానికి నీచోపమానాలు వేస్తావా? గూడ్సు రైలంటావా... అయినా నేను ఐదారుగుర్ని కావాలనేం కనలేదు. ఆరో సంతానానిదే అదృష్టం అంతా — అని జాతకాలవాడు చెప్పాడు. ఆ ఆరోవాడి కోసం — తప్పనిసరిగా — ఇష్టం లేపోయినా — అయిదుగుర్నీ కనేశాము. తీరా నోసి —''

''తెలుసు తెలుసు ఆ ఆరోవాడు పుట్టి భూమ్మీద పడగానే నీ యిల్లూ వాలకం — అన్నలూ, అక్కలూ ఐదుగుర్నీ చూశాడు. భయపడి పారిపోయాడు. అదృష్టం అంటే వాడిదే. అదృష్టం అంటే అదే! ఆ పారిపోడమే.''

''రామ రామా... నోరు ముయ్యరా!''

''అలాగే పని చూడు పని చూడు - ఈ పూటకొక్క రూపాయి డబ్బులేనా కళ్ళజూస్తే అర కిలో బియ్యం ఉడకేసి మా కుంతి పాండవులకి పెడుతుంది.''

''మరి నాకు?''

''అరిటాకే —''

ఆనందరావు పనిమొద్దం ఆరంభించాడు — అంటే రూపాయిని కళ్ళారా చూడడం. జేబులోంచి తీసి అప్పిచ్చేవాడు లేదు. అందువల్ల జేబులోది రోడ్డు మీద పారేసుకున్నవాడు కావాలి. వాడు ఎందుకు పారేసుకుంటాడు? కోవాలి? పూర్వజన్మలో తనకి రూపాయి బాకీ వుండి ఎగేసినవాడు ఈ జన్మలో ఎదురుపడి ఇంద నీ బాకీ అనడానికి మొహం చెల్లక ఆ రూపాయిని తను వెళ్ళే దారిలో గుట్టుగా జారవిడిచి పోయేవాడు కావాలి.

అట్టివాడీ కలియుగంలో ఉండునా?

ఎందుకుండడూ చచ్చినట్టుంటాడు. పూర్వ జన్మలో నాకు రూపాయి బాకీపడి ఈ జన్మలోనేనా తీర్చకపోతే వాడు పెద్దమనిషి కాదు... అమ్మ నీయమ్మ! అదిగో రూపాయి! హల్లదిగో రూపాయి! ... అదివో అల్లదివో శ్రీహరి వాసము! పది వేల శేషుల పడగల మయమూ హుఁ హూఁ

రోడ్డు మధ్యన ఆగిపోయాడానందరావు ... ఎదర, రోడ్డు మీద పదిహేను అడుగుల దూరంలో తళుక్ తళుక్ మని మెరిసిపోతోంది రూపాయబిళ్ళ!

పున్నమి వెన్నెలని ఆకాశానికిస్తున్న వేల మీద చందమామలా కన్నుల పండగ్గా వెలిగిపోతోంది. అద్భుతం! బ్రహ్మాండం! దేవుడున్నాడు!! అలా ఇలా క్కాదు! అమోఘంగా బోలెడున్నాడు.

గా — నీ వాడికి కొన్ని చిన్న దురలవాట్లున్నాయి. కన్నుకీ లిన్నుకీ — మారామడ దూరం పెంచెయ్య గలడు. తను ఈ పదడుగులూ వెళ్ళి వంగి ఆ సిద్ధాన్నాన్ని అందుకునేలోగా ఇంకో దౌర్భాగ్యుడు అందు మీద చెయ్యి వేస్తే?... అది తన రూపాయే ననీ, పూర్వజన్మలో బాకీ తీర్చలేనివాడు ఈ జన్మలో ఇవాళ ఇపుడు ఈ ఆపత్సమయంలో ఈ రూపాయ్యేనా ఋణం తీర్చేసుకుంటున్న మహోజ్వల ఘట్టంరా అని చెపితే వాడు ఒప్పుకుని తప్పుకుంటాడా? పోచే అని లాక్కుంటాడా?

దూరంగా నవ్వులు వినబడి తలెత్తి పైకి చూడ బోయాడు. పది టన్నుల మాగ్నెట్‌లు — ఋణ ధన ధ్రువాలలా పనిచేశాయి — చూపునీ బుర్రనీ రూపాయి బిళ్ళ తక్కున వెనక్కి లాగేసింది.

అతి కష్టం మీద కళ్ళు మూసుకుని తల పైకెత్తి చూశాడు. రోడ్డు పక్క తూము మీద ఓ రెండు పుంజీల భావి పౌరులు కూర్చుని కేరింతలు కొడుతున్నారు. సిగరెట్లు కాలుస్తున్నారు. ఒక్క వెధవకీ నేల మీద రూపాయి కనిపించినట్టు లేదు. బేఖాతరీ దశలో పెరుగుతున్న భావి పౌరులు గదా అందరికీ నెత్తి మీద కళ్ళే తప్ప నేల చూసే బాపతు కళ్ళుండవు...

అదీ మంచిదే నయ్యోవ్!

పద మగడా పద... సరి గెత్తి తీసుకో... అన్నాడు ఆకలి పురుషుడు.

పదతాను మగడా పదతాను ... కాని కాస్త ముందూ వెనకా ఆలోచించాలి. వంగి రూపాయి తీస్తుంటే — ఆ వెధవలు చూసి నాదంటారు — లేదా నవ్వుతారు. కాస్త పరువు ప్రతిష్ఠ గట్రా చూసుకోవాలి గద —

ఇగో ఆనందరావ్! నువ్వు నోటికాడ కూడు దగ్గర మీనమేషాలె క్కెడుతున్నావు. ఈ పూటా రూపాయ మనకి అందలేదో — నీ ఆకలి మంటలో అయిదు గాలన్ల పెట్రోలు పోస్తా జాగర్త.

ఏడిశావు — ఆయనే వుంటే మంగలెందుకని — నీ కంట్రోల్‌లో పెట్రోల్ డబ్బులే వుంటే నా నెత్తురు తాగేవాడివా — సర్లే నోర్మూసుకో డిస్టర్బ్ చెయ్యక ... ఏకాగ్రత ... కాంసన్‌ట్రేషన్... నన్ టూ త్రీ... వచ్చేస్తోంది. రూపాయి కదిలి వచ్చేస్తోంది. అమ్మా! శ్రీ మహాలక్ష్మీ! ... లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం... శుక్లాంబర ధరం... ఇది ముందు చదవాలి కామోసు...

అయిదారడుగుల దూరంలో వుండగా ఆగినట్టాగి అడుగులు అరడుగులుగా అతి నెమ్మదిగా వేశాడు. సూటిగా వెళ్ళి వంగి రూపాయిని తీస్తే — కుర్ర నా కొడుకులు మీదికి దూకి నాదంటే నాదంటే?...

అవునా డేంజరుంది. ఆనందరావులో కవి రచయితా నాటక కర్తా నటరాజూ మేలుకున్నారు. ఆఖరు అడుగు వేసి రూపాయిని ఓ పక్కగా దాటి వెళ్తుండగా బుజం మీద తువ్వాలు చాలా హాయిగా జారి పడిపోయింది — రూపాయి మీద —

అరె! అని ఆశ్చర్యం అభినయించి ఆగి వెనకడుగు వేస్తూనే వంగాడు తువ్వాలు కోసం. కుర్ర వెధవల సందడి ఆగిపోయింది. చూశారు! చూసేశారు!!

...ఆ ఏవిటి వాళ్ళ బొంద చూసి చచ్చేది. పై తువ్వాలు పడింది; ఆసామీ వంగి తీసుకుంటున్నాడూ

## గర్భస్థ శిశువుకూ పాఠాలు చెప్పొచ్చు

''గర్భిణి వినే విషయాలను గర్భంలో వుండే శిశువు కూడా ఆలకిస్తుంది, గ్రహిస్తుంది. ఒక పాఠ్య భాగాన్ని గర్భిణికి వినిపించామంటే, ఆ గర్భిణి యొక్క కడుపులో వుండే శిశువు పుట్టి కొంచెం పెరగ్గానే ఆ పాఠ్య భాగాన్ని మరల విన్నట్లైతే దాన్ని ముందే తెలిసి వున్నట్లు చెప్పేస్తుంది'' అనే అంశాన్ని విజ్ఞాన శాస్త్రవేత్తలు ఇటీవలే పరిశోధనల మూలంగా గ్రహించారని పత్రికల్లో వార్త వెలువడింది.

కానీ, ప్రహ్లాదుడు నారద మహర్షిద్వారా, తల్లి గర్భంలో వున్నప్పుడే విష్ణుభక్తిని నేర్చాడు, అభిమన్యుడు కూడా ఇట్లే పద్మవ్యూహంలోకి ప్రవేశించడం నేర్చాడని పురాణాలు తెలుపుతున్నా మనం పెద్దగా పట్టించుకోలేదు. విశ్వసించనూలేదు.

భారతీయ వైద్య శాస్త్ర గ్రంథాలలో — తలమానికమైన 'చరక సంహిత' అనే గ్రంథంలో గర్భిణి వినునట్టి విషయాల కనుగుణంగా కూడా — అంటే — గర్భిణి వీర గాథలు విన్నట్లైతే శిశువుకు పౌరుషం, దయామయుల చరిత్రలు విన్నట్లైతే దయాగుణం, దేశభక్తుల కథలు విన్నట్లైతే దేశభక్తి... ఈవిధంగా శిశువుకు మనస్తత్వం ఏర్పడుతుందని ఇలా తెలిపారు.

''సత్వ వైశేష్యకరాణి పునస్తేషాం
అంతర్వత్న్యాః శ్రుతయశ్చ అభీక్ష్ణం''

దీనివలన తల్లి గర్భంలో పెరిగే శిశువు కూడా వింటుంది, వినే విషయాలను ఆకళింపు చేసుకుంటుందని మన ప్రాచీన శాస్త్రవేత్తలు తెలుసు కున్నారని తెలుస్తున్నదికదా!

—ఆయుర్వేద శిరోమణి రాజరాజేశ్వర శర్మ

— అంతే. దట్సాల్.

ఆనందరావు వేళ్ళు తువ్వాలుని కొంచెం వల్ళగా వలిపి రూపాయి బిళ్ళ మీద తడిమాయి. ఉత్తర క్షణార్థంలో తువ్వాలు గుడ్డతోపాటు బిళ్ళని పైకి తీసుకోబోయాయి. కాని బిళ్ళ లేచినట్టు లేదు. మునివేళ్ళకు తువ్వాలు గుడ్డే తగులుతోంది. తీసిన తువ్వాలును మళ్ళీ వదిలేశాడు.

కుర్ర వెధవలు నిశ్శబ్దంగా వున్నారు.

చూస్తున్నారా? ... లేపోతే వెళ్ళిపోయారేమో ఆశ్చేసి... తలెత్తకుండానే కన్నులెత్తి తూము కేసి చూశాడు. వెధవలు గోడ మీది కోతుల్లా అక్కడే కూర్చున్నారు. కాని కోతుల్లా కిచకిచమనటం లేదు... రూపాయిని మళ్ళీ లాగాడు. అది కదల లేదు. నిశ్శబ్దం చేతి మణికట్టులో బ్రిడ్జి మీద రైలింజనులా అదర గొడుతోంది. నిండా మునిగినవాడికి చలేమిటి? హర




హర మహాదేవ! — తువ్వాలు తీసేసి ఆ వెండి బిళ్ళని పల్లిగ్గా తీసుకోబోయాడు.

ఆ!...

అది రూపాయి బిళ్ళ కాదు! కార్కు సోడా మూత. చదును చేసి తిరగేసి రోడ్డు మీద పెట్టి చిన్న మేకు కొట్టారు — రూపాయిలా కనిపించింది.

తాడుని చూసి పాముని చూసి తాడుని చూసి పాముని చూసి

నిశ్శబ్దం భళ్ళున బద్దలైంది. ఈలలు, చప్పట్లు హహ్హాహోలు! ఒళ్ళు చచ్చిపోయింది. ఆనందరావు లేచింది. నిలబడి అటు చూసింది. ఓరి కుర్ర నా కొడుకుల్లారా! ఒక దీమడిని హేమడిని చేసి నవ్వే పీనుగుల్లారా!... ఈ ఆశ — ఈ బాధ ఈ కష్టం మీకు ఇపుడు తెలీదురా. పదేళ్ళలో పెళ్ళిళ్ళయి ఐదారేసి మంది గాడిద కొడుకుల్ని కని జీతాలందకా అప్పులు దొరక్కా ఆకలి నీరసాలతో ఒళ్ళు తూలి కళ్ళు తిరిగి చావబోయే వేళ మీకు అర్థమవుతుందిరా... అలా అవాలని శపిస్తున్నానురా... మీరీ గోదారొడ్డు షికార్లూ, సినిమాలూ తెవుల్చుకుని ఆకలితో ఇళ్ళకొచ్చేసరికి అమ్మా అన్నం అంటూ నిధిలోంచే పిలికేక పెట్టే వేళకి మీ కంచాల్లో

'కుంభాలు నింపడానికి మీ తలిదండ్రులు నానా ఎక్కడెక్కడ గడ్డి కరుస్తున్నారో అప్పులు చేస్తున్నారో అడుక్కుంటున్నారో దొంగతనాలూ మోసాలూ చేస్తున్నారో గొంతుకలు కోస్తున్నారో కాళ్ళు పట్టే దొడ్లొడ్చి ఏమేం హింసలు పడుతున్నారో — మీ ఆకళ్ళ గురించి ఎంతెంత క్షోభలు పడుతున్నారో మీకేం తెలుసురా భావి పౌర కుంకల్లారా అని గుండె గావుకేకలు పెట్టింది.

కసిగా చూస్తూ అలాగే నిలబడిపోయాడు. కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

ముసిలాడు సిగ్గుతో వెత్తిన గుడ్డేసుకుని పారిపోకుండా — బరితెగించి నిలబడి కసిగా చూడ్డంతో తూము మీద కుర్రాళ్ళు బెదిరారు. నవ్వులు మానేసి తూము దిగి నిలబడి ఆనందరావు వంక చూశారు. వాళ్ళ జోకు బెడిసికొట్టింది. ఆనందరావు ఇపుడు వాళ్ళ ముఖాన ఉమ్మేస్తే వాళ్ళు కోంబడరు. లాగి లెంపకాయ కొడితే తిరిగి కొట్టరు. ముఖాలలో తప్పు చేసి దొరికిపోయిన వాళ్ళలా ఒక జిడ్డి నవ్వు జలగలా సాగి నిలబడింది.

పిడుగు!

ఆనందరావు వెత్తిన పేద్ద పిడుగు పడింది. తలని చీల్చి కపాలం బద్దలుకొట్టి లోపలికి దిగి గుండెలో పెఠేలున మళ్ళీ పేలింది.

ఎదరగా వున్న ఆరుగురు భావి పౌరులలో ఒకడు తనకి తెలిసిన కుర్రాడు! బాగా తెలిసినవాడు.

తన పెద్ద కొడుకు!

17 ఏళ్ళ యువరాజా!


సుంద్రరామారావు!

మైగాడ్!

ఇంతకన్న అవమానమేమి? ఓ రామచంద్రా! ఇంతకన్న అవమానమేమి?

తండ్రిని ఓడించిన వీరులుండేవారు. ఇవాళ తండ్రిని చావుదెబ్బ కొట్టిన వీరులు.. అబ్బా! ఏమి దెబ్బ!

—(మిగతా వచ్చే సంచికలో)



## శేషప్రశ్న

లైబ్రరీలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు రాంబాబు. దవడలు లోనికి పోయి మాసిన గడ్డంతో చీలికలు పడ్డ గుడ్డలతో నీరసంగా కన్పిస్తున్నాడు. నిస్తేజమైన అతని కళ్ళల్లో సరికొత్త ఉషస్సు కోసం, దివ్య తేజస్సు కోసం ఎదురుచూపు వుంది.

కడుపులో మెలిపెడ్తున్నట్టు బాధ. అది ఆకలి బాధ. అనుభవంద్వారా తప్ప మరే విధంగానూ అర్థం చేసుకోలేని భయంకర అనుభూతి.

రాంబాబుకి డిగ్రీ వుంది, మంచి కాండక్ట్ వుంది, పనిచేయగల సమర్థత వుంది. కాని. పని యిచ్చే వాడే లేదు. అడిగే హక్కు రాజ్యాంగం యివ్వలేదు. తృప్తిగా బ్రతకటం, కష్టపడిన దానికి ఫలితం పొందటం, అందరిలా భార్యా పిల్లలతో జీవన యాత్ర సాగించడం— యివి రాంబాబు కోర్కెలు. అవి తీరేది ఎలా అన్నదే అతడ్ని చాలా కాలంగా వెంటాడి వేధిస్తూన్న సమస్య

కడుపులో ప్రేవులు చుట్టుకు పోతున్నట్టుగా వుంది. ముఖం నిండా స్వేద బిందువులు పుట్టుకొచ్చి ఒకదానితో ఒకటి కలిసి చిన్న ప్రవాహంలా మారాయి. అతి కష్టం మీద లేచి నిలబడ్డాడు. కళ్ళు తిరుగుతున్నట్టనిపించి వెంటనే కూర్చీలో కూలబడి పోయాడు.

"బాబూ!"

నెమ్మదిగా కళ్ళు తెరిచి చూసాడు రాంబాబు. ఎదురుగా సీతాపతి మాస్టారు.

"ఏంబాబూ! భోజనం చెయ్యలేదా!"

ఆయన ఆప్యాయతకు కరిగిపోయాడు రాంబాబు. తినడానికి లేదని చెప్పాలో, తినలేదని చెప్పాలో తెలియక అతని మధ్యతరగతి మనసు తికమక పడింది. నీరసంగా పెదాలు కదిపాడు.

"తిన్నాను మాస్టారు. బోఫోర్స్ సమస్య అనే పప్పూ, అల్లుళ్ళ రాజకీయాలనే కూరలూ, సరిహద్దు తగాదాలనే పులుసూ, కోట్ల రూపాయిల ఖర్చుతో పార్టీ ప్రచార సభలనే గడ్డ పెరుగూ వేసుకొని తీవ్రవాదపు ఘాతుకాలను చవిచూస్తూ సుష్టుగా భోజనం చేశాను"

అతని మాటలకు మాస్టారి కళ్ళు వర్షించాయి.

"ఎప్పుడు ఈ సమాజం బాగుపడేది, ఎప్పుడు రాజకీయ వాదులు అసలు సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించే వింత ధోరణికి స్వస్తి పలికేది, ఎప్పుడు సగటు మనిషి జీవితంలో కొత్తవెలుగు విరజిమ్మేది?"

తనలో తను గొణుక్కుంటున్నట్టుగా వుండిపోయారు మాస్టారు.

-పీసపాటి చంద్రశేఖర్